ఆదాయం జాస్తి.. సౌకర్యాలు నాస్తి


పరదాల కింద వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్ వ్యాపారులు

- సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్న వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్ వ్యాపారులు
- సరిపడినన్ని టాయిలెట్లు కూడా లేక వెతలు

తగరపువలస : ఆనందపురం మండలం వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్‌లో సరైన వసతులు లేక ఇక్కడి పూలు, పండ్లు, కూరగాయల రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజూ అర్ధరాత్రి దాటిన తర్వాత ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల నుంచి రైతులతో పాటు స్థానికులు తమ పంటలను విక్రయానికి ఈ మార్కెట్‌కు తీసుకువస్తుంటారు. విశాఖ, తగరపువలస, మధురవాడ ప్రాంతాలతో పోలిస్తే వేములవలస మార్కెట్‌లో కూరగాయలు, పువ్వులు హోల్‌సేల్‌గా విక్రయించడంతో పాటు ధరలు తక్కువగా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. ఇక ఫంక్షన్లు జరిగే ఇళ్లలో విందులకు ఎక్కువ సంఖ్యలో కూరగాయలు, పువ్వులు, పండ్లు కొనుగోలు చేసేవారు తప్పకుండా ఈ మార్కెట్‌కు వస్తారు. ఏటా వేములవలస పంచాయతీకి మార్కెట్ వేలం ద్వారా రూ.కోటికి పైగా ఆదాయం లభిస్తుంది. ఈ ఏడాది జూలై నుంచి 2025 మార్చి వరకు 9 మాసాలకు సంబంధించి వేలం ద్వారా పంచాయతీకి రూ.1.27 కోట్ల ఆదాయం వచ్చింది. ఇంత ఆదాయం సమకూరుతున్నా ఇక్కడ వసతులు మాత్రం పూజ్యం. వ్యాపారస్తులకు నిలువ నీడ కూడా లేకపోవడంతో ఎండైనా, వానైనా పరదాలు వేసుకుని వాటి కిందే వ్యాపారాలు నిర్వహించుకోవలసి వస్తుంది. ఇంకా చిరు వ్యాపారులైతే స్వచ్ఛంద సంస్థలు ఇచ్చే గొడుగుల కిందే రోజంతా వ్యాపారం చేసుకుంటారు. మార్కెట్‌కు సరిపడినంత స్థలం లేకపోడంతో వేములవలస–ఆనందపురం రోడ్డుపైనా, తగరపువలస–పెందుర్తి జాతీయ రహదారిపైనా వేకువజాము నుంచి ఉదయం 10 గంటల వరకు వ్యాపారాలు నిర్వహించుకుంటూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుంటారు. దీంతో అటు వాహనదారులు, మండల ప్రజలు, ట్రాఫిక్ పోలీసులతో ఇక్కడి వ్యాపారులు చీత్కారాలు ఎదుర్కొంటున్నారు. అలాగే ఇక్కడ వ్యాపారులు, వినియోగదారులకు సరిపడినన్ని టాయిలెట్లు లేక ఇబ్బంది పడుతున్నారు.

వృథాగా వ్యవసాయ మార్కెట్ శాఖ సముదాయం.

ఇక్కడి వ్యాపారుల కోసం వేములవలస మహాత్మాగాంధీ డైలీ మార్కెట్‌ను ఆనుకుని భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మార్కెటింగ్ విభాగం 2009లో రూ.16 లక్షలతో మార్కెట్‌శాఖ సముదాయం నిర్మించింది. ఇందులో దుకాణాలతో పాటు రోడ్లపై వాహనదారులకు ఇబ్బంది కలిగించకుండా విశాలమైన స్థలం, సీసీ రోడ్డు కూడా ఉంది. ఈ సముదాయం డైలీ మార్కెట్‌ను ఆనుకుని కేవలం 10 మీటర్ల దూరంలోనే ఉన్నా లొడగలవానిపాలెం పంచాయతీ పరిధిలో ఉండటంతో వేలం ద్వారా ఆదాయం పక్క పంచాయతీకి వెళ్లిపోతుందనే కారణంగా కొందరు అడ్డంకులు కలిగిస్తున్నారు. అలాగని పంచాయతీకి ఏటా రూ.కోటికి పైగా, పాటదారునికి ప్రతి రోజూ రూ.50 వేల వరకు ఆదాయం సమకూరుస్తున్న మార్కెట్‌లో వసతులు కల్పించకపోవడం ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ రోడ్లపై వ్యాపారాలను పూర్తిగా నిరోధించి పక్కనే ఉన్న వ్యవసాయ మార్కెట్ సముదాయంలోకి సగం వ్యాపారులను తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మహాత్మాగాంధీ డైలీ మార్కెట్‌కు ఉన్న చెడ్డపేరును తొలగించాలని కోరుతున్నారు.


వేములవలస డైలీ మార్కెట్‌లో చాలీచాలని టాయిలెట్లు


నిరుపయోగంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ నిర్మించిన మార్కెట్ సముదాయం


మార్కెట్ బయట గొడుగుల కింద వ్యాపారులు

ఆదర్శమూర్తి పింగళి వెంకయ్య


జాతీయ పతాకం ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎంఈవో–2 జయప్రద

భీమునిపట్నం: మన దేశ జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య ప్రతి ఒక్కరికి ఆదర్శమని స్థానిక జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) సీనియర్ అధ్యాపకుడు జి.జి.ఎస్.నాగేశ్వరరావు అన్నారు. పింగళి జయంతి సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జెండా రూపకర్త తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఈ జెండాను చూసి మహాత్మాగాంధీ ప్రశంసించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఇటువంటి మహోన్నత వ్యక్తులను గౌరవించుకోవడంతో పాటు ఛాత్రోపాధ్యాయులు పాఠాలు చెప్పే సమయంలో విద్యార్థులకు ఆయన గొప్పదనం గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎల్.సుధాకర్, సి.ఎ.సోమయాజులు, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి, పి.హరిణి, గొట్టేటి రవి పాల్గొన్నారు.


పింగళి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డైట్ అధ్యాపకుడు, ఛాత్రోపాధ్యాయులు

వెంకయ్యకు దక్కిన గౌరవం

తగరపువలస: ఒక జాతి ఉద్యమానికి పతాకం ఎంతో అవసరమని భావించిన పింగళి వెంకయ్య రూపొందించిన ఇప్పటి మన జాతీయ పతాకానికి సరైన గుర్తింపు లభించిందని భీమిలి ఎంఈవో–2 అట్టాడ జయప్రద అన్నారు. వెంకయ్య జయంతి సందర్భంగా బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయన గురించి విద్యార్థులకు వివరించారు. వాస్తవానికి మన దేశ పతాకం రూపొందించడంలో అనిబిసెంట్, సిస్టర్ నివేదిత, బైకాజీ కామా వంటి వారు ప్రయత్నం చేసినా వెంకయ్యకు ఆ గౌరవం దక్కిందన్నారు. వెంకయ్య గురించి ఆంగ్లపత్రికలు, చైనా జాతీయ నాయకులు కొనియాడారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల సేవలో భీమిలి అధికారులు

- కోడ్ అమల్లోకి వచ్చినా తొలగించని జెండాలు, ఫ్లెక్సీలు

తగరపువలస: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్ అమలులోకి వచ్చినా భీమిలి అర్బన్, రూరల్ అధికారులు కూటమి నాయకుల సేవలో మునిగి తేలుతున్నారు. భీమిలి మండలంలోని 16 పంచాయతీలు, జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని 4 వార్డులలో ఎక్కడా కూటమికి చెందిన నాయకుల ఫ్లెక్సీలు తొలగించలేదు. నాయకుల విగ్రహాలను ముసుగులు వేయలేదు. ప్రతిచోటా కూటమి జెండాలు ఎగురుతూనే కనిపిస్తుండగా ఈ రెండు రోజులలో పోటీపడి ఫ్లెక్సీలు కడుతున్నా అడ్డు చెప్పడం లేదు. శిలాఫలకాలు సైతం బహిరంగంగా కనిపిస్తున్నాయి. ప్రతి కూడలి, సచివాలయాలను ఆనుకుని ఉన్న కూటమి ఫ్లెక్సీలు, జెండాలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఎన్నికల కోడ్‌ను సక్రమంగా అమలయ్యేలా చూడాలంటున్నారు.


అంబేడ్కర్ కూడలిలో తొలగించని టీడీపీ ఫ్లెక్సీ

క్లుప్తంగా

8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

- షెడ్యూల్ ప్రకటించిన ఎంఈవో

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ఈ నెల 8న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను మండల విద్యా శాఖాధికారి శివరాణి శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 5న ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ ఉంటాయని, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య ఖరారైన ఓటర్ల జాబితాలను నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారని తెలిపారు. ఎనిమిదో తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరుగుతుందని 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 2 గంటలకు వీరి ప్రమాణ స్వీకారాలు ఉంటాయని, అనంతరం తొలి కమిటీ సమావేశం జరుగుతుందని వివరించారు. ఈ మొత్తం ప్రక్రియకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

కేరళ వరద బాధితుల కోసం నిధుల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీపీఎం సభ్యులు

భీమునిపట్నం: కేరళ వరద బాధితుల సహాయార్థం భీమిలి జోన్ సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. సీపీఎం జిల్లా నాయకుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో వందలాది మంది మృత్యువాత పడ్డారని, వేలాది మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో వారికి సాయపడటం మనందరి నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వర్తక సంఘం సభ్యుడు వెంకటరమణతో పాటు ఇతర వ్యాపారులు రూ.5,517 అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.అప్పలనాయుడు, నాగరాజు, ముఠామేస్త్రీ గురప్ప, కార్మికులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతికి కేంద్ర బడ్జెట్ దోహదం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ శంకర్రావు

కొమ్మాది: కేంద్ర బడ్జెట్‌లో వివిధ విభాగాల్లో జరిగిన కేటాయింపుల వల్ల దేశంలో పారిశ్రామిక ప్రగతికి అవకాశం ఏర్పడిందని జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ ఈమంది శంకర్రావు అన్నారు. శుక్రవారం గీతంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశంలో మౌలిక సదుపాయాల రంగానికి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమ రంగానికి కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు చేయడం దేశ ఆర్థిక ప్రగతికి, ఉపాధి అవకాశాలు పెరగడానికి దోహదపడుతుందని అన్నారు.

హెల్మెట్‌ధారణపై న్యాయ విద్యార్థుల ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న న్యాయ విద్యార్థులు

కొమ్మాది : గీతం స్కూల్ ఆఫ్ లా లీగల్ ఎయిడ్ సెల్ ఆధ్వర్యంలో 'హెల్మెట్ ధారణ – రహదారి భద్రత'పై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ ప్రొఫెసర్ అనితారావు మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజలు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించండి ప్రాణాలు రక్షించండి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం పేపర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ పేపర్ మర్చంట్ అసోషియేషన్ ప్రతినిధులు విద్యార్థులకు బహుమతులుగా పుస్తకాలు అందించారు. వీటిని స్థానిక పి.పి.ఆర్. గుప్తా స్టేషనరీ దుకాణ యజమాని పలివెల రాజశేఖర్ గుప్తా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాట్నూరు మురళీమోహనరావు, ఉపాధ్యాయుడు పక్కి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులతో విద్యార్థులు

దళితుల వర్గీకరణ సమంజసం కాదు

తగరపువలస : అన్నదమ్ముల వలె కలసిమెలసి ఉన్న మాల, మాదిగలను వర్గీకరణ పేరుతో విభజించడం సమంజసం కాదని మాల మహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు అన్నారు. శుక్రవారం ఉదయం అంబేడ్కర్‌కూడలి వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉండటంతోనే అధికారం కోల్పోయినట్టు గుర్తు చేశారు. 77 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో గ్రామీణ ప్రాంతాల్లో మాలలు ఇంకా అధ్వాన్న స్థితిలోనే ఉన్నారని గుర్తు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో దళిత నాయకులు రవ్వ ఈశ్వరరావు, గుడివాడ కిరణ్, మామిడి శివ, భాగం కృష్ణ, ఉప్పాడ కిరణ్, మద్దిల తీన్‌మూర్తి, గుడివాడ సూర్యనారాయణ, ఎడ్ల రమేష్‌కుమార్, నందల సన్యాసిరావు, గుడివాడ ఈశ్వరరావు, బోని ఆదిరాజు, ఎరుకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలియజేస్తున్న మాల మహానాడు వ్యవస్థాపకుడు గోపాలరావు తదితరులు

జోరుగా వరి నాట్లు


నాట్లు వేయడానికి మడి వద్దకు వరి నారు తీసుకువెళ్తున్న మహిళ


మద్దిలో వేసిన వరి నాట్లు


పొలంలో వరి నారు తీస్తున్న మహిళలు

- విద్యుత్ మోటార్లు ఉన్న గ్రామాల్లో ప్రారంభం
- కూలీలకు పెరిగిన గిరాకీ

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో జోరుగా వరి నాట్లు వేస్తున్నారు. దీంతో కూలీలకు గిరాకీ ఏర్పడింది. విద్యుత్ మోట్లారు ఉన్న గ్రామాల్లో ఈ నాట్లు వేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట విస్తీర్ణం 6,627 ఎకరాలు కాగా ఇప్పటికే 1859 ఎకరాల్లో ఉబాలు వేశారు. మండలంలోని కృష్ణాపురం, మద్ది, తునిపాలెం, అనంతవరం, విలాస్కాన్‌పాలెం, విజయరాంపురం, గంధవరం గ్రామాల్లో విద్యుత్ మోటార్లు ఉన్నాయి. ఈ గ్రామాల్లో వారం రోజుల నుంచి వరి నాట్లు వేయగా, మరి కొంతమంది ఇప్పుడు వేస్తున్నారు. మోటార్లు ఉన్న రైతులు అందరూ ఒకే సారి నాట్లు వేయడంతో ట్రాక్టర్లకు, కూలీలకు గిరాకీ ఏర్పడింది. ముందుగా రైతులు నాట్లు వేసే ముందు భూమికి నీరు పెట్టి ట్రాక్టర్లతో దమ్ము పట్టాలి. ఎకరం విస్తీర్ణంలో దమ్ము పట్టడానికి గంటకు రూ.1500 తీసుకుంటున్నారు. ఎకరం విస్తీర్ణంలో దమ్ము పట్టడానికి మూడు గంటలు పడుతుంది. దీని ప్రకారం ఎకరానికి దమ్ము పట్టడానికి రూ.4500 ఖర్చు అవుతుంది. నారు తీసేందుకు కూలీలకు రూ.1600 అవుతుంది. ఎకరంలో నాట్లు వేయడానికి మహిళా కూలీలకు రూ.3వేలు ఇస్తున్నారు. రైతులు ఇంత డబ్బులు వెచ్చిస్తున్నా కూలీలకు డిమాండ్ ఏర్పడింది. కూలీలు దొరక్క ఇబ్బంది పడుతున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

పద్మనాభం : మండలంలోని పాండ్రంగిలో ఓ యువతి అదృశ్యమైనట్టు ఎస్‌ఐ సురేష్ చెప్పారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. పాండ్రంగి గ్రామానికి చెందిన షేక్ చాన్‌బీ (18) గత నెల 30 రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈమె మద్ది ఓమ్ సాయి కళాశాలలో ఇంటర్ చదువుతోంది. దీనిపై చాన్‌బీ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. చాన్ బీ ఆచూకీ తెలిసిన వారు 94906 17920 నంబర్‌కు సమాచారమందించాలని ఎస్‌ఐ కోరారు.

ఎండాడలో చైన్ స్నాచింగ్

కొమ్మాది: రోడ్డుపై నడిచి వెళ్తున్న ఓ మహిళ మెడలో చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని వెళ్లిన సంఘటన ఎండాడలో చోటు చేసుకుంది. ఆరిలోవ క్రైమ్ ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాలివి.. ఎండాడ జాతీయ రహదారి నుంచి ఇదే ప్రాంతానికి చెందిన రేణుక అనే మహిళ శుక్రవారం రాత్రి స్కైలైన్ అపార్టుమెంట్ వైపు నడిచి వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలో ఉన్న రెండు తులాల గొలుసు లాక్కుని పరారయ్యాడు. వెంటనే ఆమె 112కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. వెంటనే క్రైమ్ ఎస్‌ఐ హరికృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఆ వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అమ్మవార్లకు సారె సమర్పణ

- ఘనంగా కనకదుర్గమ్మ, భూలోక మాత ఉత్సవాలు
- రేవళ్లపాలెం, నగరపాలెం గ్రామాలకు పండగ శోభ


నగరంపాలెంలో కనకదుర్గమ్మకు సారె సమర్పణకు ఊరేగింపుగా వెళ్తున్న పరిసర గ్రామాల భక్తులు


రేవళ్లపాలెంలోని భూలోకమాత అమ్మవారు

మధురవాడ: పల్లెలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ అమ్మవార్లకు సారె సమర్పించారు గ్రామస్తులు. ఆషాడమాసం సందర్భంగా సంప్రదాయసిద్ధంగా ఊరేగింపు నిర్వహించి గ్రామదేవతలకు నివేదించారు. జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెంలో వెలసిన భూలోక మాతకు, జీవీఎంసీ 7వ వార్డు నగరంపాలెం గ్రామ దేవత కనక దుర్గమ్మవారికి ఆయా గ్రామాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సారె సిద్ధం చేశారు. పదుల సంఖ్యలో స్వీట్లు, పండ్లు, ఫలహారాలు, వివిధ రకాలు పిండి వంటలను వందలాది మంది మహిళలను శిరసున ధరించి, సాము గరిడీలు, కోలాటం, మందు గుండు సామగ్రితో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు సమర్పించారు. దీంతో ఆయా ప్రాంతాలు పండగ శోభను సంతరించుకున్నాయి.


రేవళ్లపాలెంలోని భూలోక మాతకు భక్తులు సమర్పించిన సారె

అమ్మ పాలు అమృతతుల్యం

- బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం
- యూపీహెచ్‌సీ వైద్యాధికారి మానసలక్ష్మి
- తల్లిపాల విశిష్టతపై అవగాహన


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

మధురవాడ: తల్లి పాలు బిడ్డకు అమృత తుల్యమని స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి పి. మానసలక్ష్మి అన్నారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం వలన శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లులు, బాలింతలకు తల్లి పాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డలు రోగాలు బారిన పడకుండా తల్లిపాలు రక్షణ కవచంగా నిలుస్తాయన్నారు. పిల్లలకు పాలివ్వడం తల్లి, పిల్లలకు కూడా మంచిదని వివరించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఎం.లక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి 7 వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మహిళా పోలీసు ఎం.లక్ష్మి రాధిక, లక్ష్మీ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు అనుపమ, జ్యోత్స్న, ఏఎన్‌ఎంలు కె.అలేఖ్య, బి.వరహాలమ్మ, వి.దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.


దాకమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రేఖావాణి

ముర్రు పాలు బిడ్డకు శ్రేష్టం

పద్మనాభం: పుట్టిన బిడ్డకు తల్లి ముర్రి పాలు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని కురపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి పాలు పడితే వ్యాధి నిరోధక శక్తి వృద్ధి చెందుతుందన్నారు. పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లి పాలే పట్టాలని, ఆరు నెలలు దాటిన తరవాత నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అందించాలని సూచించారు. తల్లి పాలలో బిడ్డకు అవసరమైన పోషకాలు, విటమిన్లు, మినరల్స్ అందుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.ఎల్లయ్యమ్మ, హెల్పర్ టి.దుర్గ పాల్గొన్నారు.


తల్లులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని అంగన్‌వాడీ భీమిలి రూరల్ సూపర్‌వైజర్ రేఖావాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా భీమిలి మండలం ముద్దాడపేట సెక్టార్ దాకమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. కార్యక్రమంలో దాకమర్రి–1,2, ముద్దాడపేట, నీలయమ్మసత్రం, అల్లుపేట, బోడమెట్టపాలెం అంగన్‌వాడీ కార్యకర్తలు కె.లక్ష్మి, పి.లక్ష్మి, నారతల్లి, కృష్ణవేణి, శ్రీదేవి, సంధ్య పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే సమాజ శ్రేయస్సు



న్యాయ సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

పీఎం పాలెం : మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరు నైతిక విలువలు పాటించాలని, దుర్వ్యసనాలు విడనాడాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ఎం. వెంకట శేషమ్మ అన్నారు. జీవీఎంసీ 6వ వార్డులోని శంభువానిపాలెం గిరిజన గ్రామంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. న్యాయ చట్టాలపై ప్రజలు కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. లేని పక్షంలో చిన్న చిన్న పొరపాట్లే శిక్షలకు, జరిమానాలకు దారి తీస్తాయని తెలిపారు. విశాఖ నార్త్ డివిజన్ ఏసీపీ సునీల్ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయించినా నేరమన్నారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై. రామకృష్ణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలన్నారు.

280 మందికి ఉచిత వైద్యపరీక్షలు..

శంభువాని పాలెంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 280 మందికి కేజీహెచ్, గీతం కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొని వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ సునీత, పోలీసులు పాల్గొన్నారు.